ప్రజాశక్తి
సోమవారం 30 జూన్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





వెంగళరావు నగర్‌లో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునే లక్ష్యంగా ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆదివారం వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది వెంగళరావు నగర్ ఏరియాలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐలు నలుగురు, ఎస్ఐలు నలుగురు, స్పెషల్ పార్టీకి సంబంధించిన పలువురు సిబ్బంది సహాయంతో సుమారు 460 నివాసాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా సరైనపత్రాలు లేని 45 ద్విచక్రవాహనాలు, 1 ఆటో స్వాధీనం, 6 మంది స్థానికేతరులను గుర్తించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా మీడియాతో పోలీసు అధికారులు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతి భద్రతలను పరిరక్షణ, అసాంఘీక శక్తుల ఏరివేతే లక్ష్యగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచటానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు.



జాతీయ రహదారి దిగ్బంధనం..

-కరేడులో బలవంతపు భూసేకరణ నిలిపివేయాలని ఆందోళన
- రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం.. తోపులాట
-బారికేడ్లను నెట్టుకెళ్లిన మహిళా రైతులు
- 2000 మంది రైతులతో జాతీయ రహదారిపై రాస్తారోకో

మా పంట పొలాలు పరిశ్రమలకు ఇవ్వబోమని రైతులు రొడ్డెక్కారు.. ప్రభుత్వ హెచ్చరికలను లెక్కచేయకుండా వేలాది మంది కలకత్తా - చెన్నెయ్ జాతీయ రహదారిపై బైఠాయించారు.. శనివారం నుంచి పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. కొందరు రైతులను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరేడు ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకున్నాయి. ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి రావడంతో సిపిఎం, కాంగ్రెస్, ఆప్, విసివై బిసివైతోపాటు 139 కులాల బిసి ఐక్య వేదిక నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అందరినీ కందుకూరుకు తలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ప్రజాశక్తి -ఉలవపాడు

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం, కరేడు గ్రామ రైతులు వ్యవసాయ భూములే 'మాకు ముద్దు... పచ్చని పంట పొలాలను ఇండో సోలార్ వారికి మా భూములు ఇవ్వలేమని బీష్మించారు. ఇటీవల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిని నిరసిస్తూ ఆదివారం కరేడు గ్రామ రైతులు భారీగా తరలివచ్చి కరేడు ర్యాంపు వద్ద జాతీయ రహదారిపై 20 నిమిషాలు దిగ్బంధించారు. శనివారం నుంచే రైతులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలియడంతో ముందుగానే పోలీసులు అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. కరేడు గ్రామ రైతులు జాతీయ రహదారిపై ఎలాంటి ఆందోళన కార్యక్రమం జరగకుండా పోలీసులు కరేడు గ్రామం చుట్టూ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు, రైతులు మధ్య తోపులాట మధ్య ఈ రాస్తారోకో నిర్వహించారు. 8348 ఎకరాల భూమిని విండో సోలార్ కంపెనీకి ప్రభుత్వం కేటాయిస్తూ జీవో ఇచ్చింది. భూసేకరణ నోటీసులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆందోళన నేపధ్యంలో శనివారం రాత్రి మిరియం శ్రీనివాసులు నాయకుడిని అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం. కరేడు గ్రామం నుండి ఎవరి బయటకు రాకుండా కరేడు ర్యాంపు వరకు మధ్యలో బార్కెట్లు



జాతీయ రహదారిని దిగ్బంధించిన రైతులు

ఏర్పాటు చేసి ఎవరు రాకుండా పోలీసులు మోహరించారు. కరేడు గ్రామంలో భూములు , ఇళ్ల స్థలాలు కోల్పోతున్న రైతులు గ్రామ స్తులు ఆందోళనకారులు, రైతులు ద్విచక్ర వాహనాలు, లారీలు, ట్రాక్టర్లపై రెండు వేల రైతులు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ సంఘటన వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. పచ్చని పంట పొలాలు భూములను తాము ఇవ్వలేమని, ఆ భూములు కావాలంటే మా శవాలు మీద వెళ్లాలని రైతులు ఖరాకండిగా తేల్చిచెప్పారు. పోలీసులకు రైతులకు దాదాపుగా గంటపాటు తోపులాట జరిగింది. రైతులను రానివ్వకుండా పోలీసులు వాహనాలు అడ్డుపెట్టి ప్రయత్నించిన తొలగించుకొని రైతులు జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. పొలాల నుంచి పక్క దారుల నుండి పోలీసులను తప్పించుకొని హైవే వద్దకు రైతులు చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. కరేడు చుట్టుపక్క గ్రామాల నుండి మహిళా రైతులు భారీగా తరలిరావడంతో సుమారుగా దాదాపుగా 20 నిమిషాల పాటు జాతీయ రహదారిపై వాహనాలు రెండువైపులా నిలిచిపోయాయి. పరిస్థితి ఉద్రికత్తగా మారింది. సిపిఎం, కాంగ్రెస్, ఆప్, విసివై, బిసివై పార్టీ నాయకులు మూలం రమేష్, సుంకర పద్మశ్రీ, బోడే రామచంద్రయాదవ్.సామాజిక వేత్త కె. వసుంతర తదితరలు రైతులకు మద్దతుగా నిలిచారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి, కందుకూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంది.. టిడిపి, బిజెపి, జనసేన సుపరిపాలన అందించామని సంబరపడి పోతున్నాయి.. టిడిపిలో నాయకులు, కార్యకర్తల్లో అంసృత్తి రగులుతున్నాయి..."మా పార్టీ అధికారంలోకి వచ్చిందా... వైసిపినే అధికారంలో ఉందా" అంటూ అనేక సార్లు వ్యంగ్య బాణాలు విసురుతున్నారు..వైసిపిపాలనలో ఐదేళ్లు ఇబ్బంది పడ్డామని, పార్టీ అధికారంలోకి వచ్చాక తాము వెనక్కి వెళ్లి వైసిపి నేతలు టిడిపిలో ముందువరసలో చేరారని ఆపార్టీ నేతలు బహిరంగంగానే విమర్శి స్తున్నారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కొన్ని నిలబెట్టుకున్నా గత ప్రభుత్వంలో అరాచకాలు జరిగాయని చెబుతోన్న టిడిపి పాలనలోనూ కొంత సాగుతుందనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. టిడిపిలో ఏళ్ల తరబడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను పక్కన పెట్టేసి, వైసిపి నుంచి వచ్చిన వారికే అందలం ఎక్కిస్తున్నారనే విమర్శలు ఆపార్టీ నేతలు ఎదుర్కోంటున్నారు. కొందరు ఎంఎల్ఏలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతుండగా, ద్వితీయ శ్రేణి నాయకులు ఆర్థిక దొపిణికి పాల్పడుతున్నారనే ప్రచారం సాగుతొంది. ఈ నేపధ్యంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో తమ్ముళ్ల పాత్ర ఎంతా అనే అనుమానం కలుగుతోంది.

తమ్ముళ్లు 'ఇంటింటి'కి వెళ్లేనా..!

-జూలై 2 నుంచి నెల రోజులు కార్యక్రమం
-అసంతృప్తితో రగులుతోన్న నేతలు, కార్యకర్తలు
-ద్వితీయ శ్రేణి నాయకుల ఆర్థిక దోపిడీ
-2029కి అప్పుడే తొందరెందుకు ?



మంగళగిరిలో టిడిపి నేతలకు దిశానిర్దేశం చేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం బిజెపి విధానాలను నెత్తినపెట్టుకుని మోస్తోంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడానికి ఏడాది కూడా సరిపోలేదు. తల్లికి వందనం పథకం పేరుతో , స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ 15 వేలు, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు అమలు చేస్తున్నారు.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు, త్వరలో అన్నదాత సుఖీభవ, ఇస్తామని చెబు తున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, లేదా నెలకి రూ 3 వేలు నిరుద్యోగ భృతి.. ప్రతి మహిళలకు నెలకి రూ 1500 ఇవ్వాల్సి ఉంది. ఇది కాకుండా కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పించన్లు పెంపు, అన్నా క్యాంటీన్లు, అమలు చేస్తున్నారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు కేవలం 40 శాతం మాత్రమే అమలు చేశారు. ప్రజల్లో కొంత సానుకూలత కనిపిస్తున్నా కూటమి నేతల్లో అసంతృప్తి రగులుతొంది. వైసిపి ఐదేళ్ల ప్రభుత్వంలో టిడిపి నేతలు నియోజకవర్గాల్లోనూ, మండలాలు, గ్రామీణ స్థాయిలో ఇబ్బందులు పడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంతా మారిపోతొందని భావించారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల విజయం తరువాత పరిస్థితులు తారు మారైపోయాయి. పార్లమంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసిపిలోని కొందరు నేతలు టిడిపిలో చేరిపోయారు. అప్పటి వరకు టిడిపిలో కీలకంగా ఉన్న నేతలంతా వెనిక్కి వెళ్లి, వైసిపి నేతలు ముందుకొచ్చారు. వీరంతా చివరి వరకు ఉంటారా లేదా అనుమానమే. ఈ క్రమంలో టిడిపి నేతలు ఆగ్రహంతో అనేక సందర్భాల్లో రచ్చరచ్చ చేస్తున్నారు. కొందరు మౌనంగా ఉండగా, ప్రజా ప్రతినిధుల వెంట తిరుగుతున్నారు.ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ఏం చేశామో చెప్పాలంటూ సిఎం చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేశారు. మాకే ఏం జరగలేదు. మేం ఏం చెబుతాం అంటూ కొందరు పెదవి విరుస్తున్నారు. గతం కన్నా కొంత పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని చెబుతున్నా పెద్దగా మార్పులేదనే అంశం ప్రజల నుంచి తరచూ వినిపిస్తూనే ఉంది. కొందరు ప్రజా ప్రతినిధులు అదికారాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. జూలై 2 నుంచి నెల రోజుల పాటు ఇంటింటికి వెళ్లడానికి టిడిపి నాయకత్వం సన్నాహాలు చేస్తుంది. అధికారపార్టీ కనుక కార్యక్రమం విజయవంతమైనా నేతల్లో అంతృప్తిని మాత్రం తగ్గించే అవకాశాలు కనిపించడం లేదు

ద్వితీయ శ్రేణి నాయకుల ఆర్థిక దోపిడీ ..!

వైసిపి ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, తాము అంతా మార్పు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోనూ ఆర్థిక దొపిణి కొనసాగుతూనే ఉంది. కొందరు ఎంఎల్ఎలు, వారి వెనుక తిరిగే ద్వితీయ శ్రేణి నాయకులు ఆర్థిక దొపిడికి పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకొస్తే, పేదల పేరు చెప్పి అనేక చోట్ల అడ్డదారిలో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ప్రభుత్వ అధికారులు కళ్లు మూసుకు కూర్చొన్నారు., గ్రావెల్స్, సిలీకా, మైనింగ్, దందాలోనూ కూటమి నేతల పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సిఎం చంద్రబాబు 2029 ఎన్నికలే నా టార్గెట్ అంటున్నా. ఇంకా నాలుగేళ్ల ఉండగా అప్పుడే తొందరెందుకు అని పార్టీ నేతలే అంటున్నారు. ఇదిలా ఉంటే గత ఎన్నికల్లో అప్పటి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటి ప్రభుత్వం పేరుతో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ప్రజల తీర్పు ఎలా ఉంటుందో చూశారు. జనం ఏది చెబితే అది ఇంటారనే దొరణి నాయకుల్లో ఉంది. ప్రజలు మాత్రం ప్రతి విషయాన్ని గమనిస్తున్నారు. ఎప్పుడు, ఎలా వ్యవహారిస్తారో చూపిస్తున్నారు.



మాట్లాడుతున్న కాకాణి పూజిత

జగన్ పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనను జయప్రదం చేయాలని మాజీ మంత్రి కాకాణి కుమార్తె పూజిత కోరారు. ఆదివా రం ఆమె తోటపల్లిగూడూరు మండలం వరకవిపూడి గ్రా మంలో వైసిపి సీనియర్ నాయకులు, స్థానిక సర్పంచ్ ఇ సనాక రమేష్ రెడ్డి గృహంలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షులు ఉ ప్పల శంకరయ్య గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పూజిత మాట్లాడుతూ తన తండ్రి గోవర్ధన్ రెడ్డి అక్రమంగా అరెస్టయ్యరన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల ఆశీస్సులతో తన తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కడిగిన ము త్యంలా కేసుల నుంచి బయటపడతారని కుమార్తె కాకాణి పూజిత ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు, ఏపీ డైరీ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి, మం డల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పల స్వర్ణలత, జడ్పిటిసి ఎంబేటీ శేష మ్మ, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, త లమంచి సురేంద్ర బాబు, చిల్లకూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ జెడ్పి టి సి, మన్నెం చిరంజీవి గౌడ్, చిల్లకూ రు ప్రవీణ్ రెడ్డి ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్

దళితుల ఆర్థికాభివృద్ధిని అడ్డుకోవడం, రూ. కోట్ల ప్రభుత్వ ధనాన్ని నిరుపయోగంగా మార్చారని ఆర్ పి ఐ నేతలు ఆరోపించారు. బుజ్జి బుజ్జి నెల్లూరులో తుప్పు పట్టి నిరుపయోగంగా మారిన వాహనాల ముందు ఆందోళన చేశారు.ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్కే మాబు మాట్లాడారు. 2018 డిసెంబర్ లో ఎన్ఎస్ఎఫ్డిసి నిరుపేద దళితులు ఆర్థికంగా అభివద్ధి చెందాలని సబ్సిడీ లోన్ల కింద వాహనాలు కేటాయించారన్నారు. ఎన్నికల కోడ్ రావడం తో పంపిణీ నిలిపివేశారన్నారు.ఎన్నికలు పూర్తి అయిన తర్వాత కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయక పోవడం తో ఆ వాహనాలు దేనికి పనికి రాకుండా పోయాయని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జిల్లా ఉపాధ్యక్షులు బత్తల మధుసూదన్.దుంపల సుబ్బారావు.ఆరికొండ సురేష్.ముసలి జయరాజ్ ఉన్నారు.

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని కోడూరు సముద్రతీరంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. ఓ వైపు మండుతున్న ఎండలు, మరో వైపు ఆదివారం సెలవు దినం కావడంతో సేదదీరేంద్రుకు జిల్లాలోని వివిధ ప్రాం తాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు కోడూరు తీ రానికి తరలి వచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సం ఘటనలు సంభవించకుండా తీరం వెంబడి ఎస్ఐ వీరేం ద్ర బాబు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏ ర్పాటు చేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ ప్రపంచంలో మానవునికి అవసరమైనది, విలువైనది ఆరోగ్యం మాత్రమేనని జిజిహెచ్ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ ఎంబెట్టి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం, స్థానిక డైకస్ రోడ్ సెంటర్ లోని వియాని హోమ్ నందు యాన్యువల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మెగా మెడికల్ క్యాంపులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు చేసిన పేదలకు, అనాథలకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదన్నారు. విద్య, వైద్యం అందరికీ అవసరం అన్నారు. అందులో భాగంగా ఈరోజు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. వియాని హోమ్ సిస్టర్స్ రమా, రూబియా , పీ.హెచ్.పీ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. స్టూడెంట్స్ కి బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించిన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాల్యాద్రి, డాక్టర్ ఏ.ఝాన్సీ రెడ్డి, డాక్టర్ సోనియా, డాక్టర్ నౌషీన్, పి.హెచ్.పి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, జయ ఉన్నారు.



'భ.ని.కా' సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ నరసింహారావు

ప్రజాశక్తి-నెల్లూరు

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, బోర్డు నుంచి కార్మికులకు రావాల్సిన బకాయి క్లైయిమ్స్‌ను వెంటనే చెల్లించాలని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ నరసింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మినీ బైపాస్ రోడ్ లోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం నగర 6వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ మహాసభ ప్రారంభోత్సవానికి ముందు భవన నిర్మాణ కార్మిక సంఘం జెండాను నాయకులు పి.సూర్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎపి భ.ని.కా కార్యదర్శి ఆర్.నరసింహారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఏళ్లతరబడి పోరాటాలు నిర్వహించి సాధించుకున్న సంక్షేమ బోర్డును పాలకులు నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. 2007లో నాటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భవన నిర్మాణ కార్మికుల పోరాటాలతో దిగి వచ్చి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారన్నారు. ఈ చర్యతో రాష్ట్రంలోని లక్షలాదిమంది కార్మికులు సంక్షేమ ఫలాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తినప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు సంభందించిన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రతిపక్ష హోదాలో చేసిన సమయంలో భవన నిర్మాణ కార్మికులకు చేసిన హామీలు విస్మరించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే భ.ని.కా సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని హితవు పలికారు భ.ని.కా సంఘం నాయకులు కాయంబు శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, సిఐటియు నాయకులు కొండా ప్రసాద్,నాయకులు జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. జూలై 9వ జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు భారీ స్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.



మహాసభలో మాట్లాడుతున్న ఆర్ నరసింహారావు

నూతన కమిటీ ఎన్నిక

మహాసభ అనంతరం 34 మందితో నూతన కమిటీ ఎన్నికయింది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ పెంచలయ్య, ఆర్ శ్రీనివాసులు, ట్రెజరర్ గా కె సంపూర్ణమ్మ ఎన్నికయ్యారు. సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఏ శ్రీనివాసులు, జి నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ చాన్ బాషా, అల్లాడి గోపాల్, సిఐటియు జిల్లా నాయకులు కొండా ప్రసాద్, నగర ఉపాధ్యక్షులు మూలం ప్రసాద్, కత్తి శ్రీనివాసులు, పి సూర్యనారాయణ పాల్గొన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులు ఎ పెంచలయ్య, ఆర్ శ్రీనివాసులు

టిడిపి సమావేశంలో ఎంఎల్ఎ 'ఇంటూరి'

ప్రజాశక్తి -కందుకూరు

మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో టిడిపి జాతీయ అధ్యక్షులు, సిఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆదివారం జరిగిన రాష్ట్ర టిడిపి విస్తతస్థాయి సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి , రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ , రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతి నిధులతో కలిసి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటి ప్రచారంపై చర్చ.- జులై 2 నుంచి సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారం నిర్వహణ పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై నేతలతో చంద్రబాబు నాయుడు మాట్లాడారు.



అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం..

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-కందుకూరు : కరేడులో బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ ఆందోళన చేస్తున్న రైతులు, ఉద్యమకారులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఆదివారం కరేడు ర్యాంపు వద్ద ఆందోళన చేస్తున్న మొత్తం 26 మంది భూ పోరాట నాయకులను పోలీసులు అరెస్టు చేసి కందుకూరు తరలించారు. ఈ నేపథ్యంలో వారిని సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ కమిటీ కార్యదర్శి మూలం రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగలి పుల్లయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఎ గౌస్,పి.పెంచలయ్య అరెస్ట్ అయిన వారిని కందుకూరు పోలీస్ స్టేషన్లో పరామర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ పోరాటానికి పూర్తి మద్దతు తెలిపారు. అనంతరం కందుకూరు సుందరయ్య భవన్లో విలేకర్ల సమావేశం నిర్వహించి అక్రమ అరెస్టులను ఖండించారు. బలవంతపు భూసేకరణ ఆపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా చేసి చేవూరు రైతులను నట్టేట ముంచిన ఇండోసోల్ కంపెనీ కరేడు రైతులను నట్టేట ముంచడానికి బయలుదేరిందని తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో వెంటనే భూసేకరణప్రకటనను వెనక్కు తీసుకోవాలని, లేకుంటే రైతులు ,దళిత ,గిరిజనులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ హెచ్చరిక చేశారు. మహిళలు అని కూడా చూడకుండా ఉలవపాడు ఎస్ఐ అంకమ్మరావు దురుసుగా ప్రవర్తించడాన్ని సిపిఎం తప్పు పట్టింది.. సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌తో పాటు మంగలి పుల్లయ్య, జి వెంకటేశ్వర్లు,ఎస్ఎ గౌస్, పి పెంచలయ్య, జివిబి కుమార్ ఉన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి

కరేడులో బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ బలవంతపు భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై దిగ్బంధించారు. పోలీసులు ఈ దిగ్బంధనాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం వందలాదిమంది పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. సిపిఎం నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, జి వెంకటేశ్వర్లు, జి వి బి కుమార్, అప్ నేత నేతి మహేశ్వరరావు, పోరాట కమిటీ నాయకులు మిరియం శ్రీనివాసులు, కాంగ్రెస్ రాష్ట్ర నేత సుంకర పద్మశ్రీ, సామాజికవేత్త డాక్టర్ కె వసుంధర, పెద్దపల్లి పాలెం రైతులు మొత్తం 26 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టులకు నిరసనగా రెండు వేలమంది పోలీస్ యొక్క నిర్బంధాన్ని కూడా లెక్కచేయకుండా జాతీయ రహదారిని దిగ్బంధించారు. 139 బిసి కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్ కూడా ఆందోళనలో రాస్తారోకోలో పాల్గొన్నారు.



సమ్మె స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఆదివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా కార్యాలయం, జేమ్స్ గార్డెన్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి కె పెంచల నరసయ్య మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, తదితర డిమాండ్ల పరిష్కారానికై జులై 9వ తేదీ జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ సందర్భంగా సమ్మె స్టిక్కర్లను ఆవిష్కరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, దేశ మూర్తి, శ్రీనివాసులు, సుజాతమ్మ, వజ్రమ్మ, భారతి, చెన్నయ్య, భాగ్యమ్మ, కొండమ్మ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడి దాతృత్వం

ప్రజాశక్తి-కందుకూరు


దాతత్వానికి సిరిసంపదలు అవసరం లేదు.. కేవలం మానవత్వం తో స్పందించే మనసు చాలు అని నిరూపించాడు పీటర్సన్ కనకరాజు. కందుకూరుకు చెందిన కనక రాజు దివ్యాంగుడు, ఎక్కడికి వెళ్లినా వాకర్, ట్రై సైకిల్ సాయం కావాల్సిందే. అతనికి ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కేంద్ర ప్రభుత్వం అలెంకో తయారు చేసిన బ్యాటరీ ట్రై సైకిల్ శుక్రవారం ఇచ్చారు. అదే సమ యంలో వాకర్ తో నడిచే మరొక పేద దివ్యాంగునికి తను అప్పటివరకు వాడు తున్న ట్రై సైకిల్ ఇచ్చేశాడు. అంటే అప్పటివరకు వాడిన వాహనం ఎవరికైనా అమ్ముదాము, కొంత డబ్బు వస్తుందని లేక నిరుపయోగంగా ఇంటి వద్ద పడేద్దాము అనుకోకుండా దానిని మరొకరు ఉపయో గించుకొనేలా ఇచ్చేశాడు. యీ మధ్య ఒక కళాశాల విద్యార్థిని తనకు చదువుకొని తిరిగివ్వమని ఇచ్చిన పుస్తకాలు పోగొడితే, వాటి వెల తీసుకున్నాడని ఆ కళాశాల ప్రిన్సిపాల్ మీద ఫిర్యాదు చేయడం చూసాం.కనకరాజు చేసిన సనిని అందరు అభినందిస్తున్నారు.



టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - లింగసముద్రం

టిడిపి మండల అధ్యక్షులుగా తనకు అవకాశం కల్పించి ఎంపిక చేసిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరు నాగేశ్వరరావు గారికి రుణపడి ఉంటాను. పార్టీ అభివద్ధికి కషి చేస్తూ అందర్నీ కలుపుకొని ముందుకు సాగుతానని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం ఆదివారం చెప్పారు. సామాజిక వర్గాల సమీకరణ నేపథ్యంలో మండల అధ్యక్షులుగా అవకాశం కల్పించేలా చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి,రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కి,,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కు కతజ్ఞతలు తెలిపారు .మండలం లోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ అందుబాటులో ఉంటూ కార్యకర్తల కోసం నిరంతరం పని చేసి పార్టీ అభివద్ధికి దోహదపడతానని చెప్పారు.



పూరిమెట్ల గురునాథం
టిడిపి మండల అధ్యక్షులు



ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - ఉదయగిరి

పట్టణంలో ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ, మాజీ జెడ్‌పి చైర్మన్ పి.చెంచల బాబు యాదవ్, మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల వృత్తి ఎంతో పవిత్రమైనదని నాగయ్య, రఫీ విధి నిర్వహణలో విద్యార్థులతో పాటు గ్రామాలలో వారి తల్లిదండ్రుల మన్నులు పొందారని గుర్తు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి 20వేల మంది ఉపాధ్యాయుల పోస్టులు భర్తీకి జిఒ విడుదల చేశారని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ రాష్ట్ర అధికారి ముువ్వ రామలింగం, ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ, మండల కన్వీనర్ సిహెచ్ బయన్న యాదవ్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్.రియాజ్, గండిపాలెం చెంచురామయ్య సాగర్ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ బొజ్జ నరసింహులు, ఎస్‌సిసెల్ నాయకులు రాజా, వివిధ యూనియన్ నాయకులు ఖాజా చంద్రశేఖర్, తోటి ఉపాధ్యాయ మిత్ర బృందం, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఇసుక తొలగింపు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నెల్లూరు - ముంబై జాతీయ రహదారి ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎఎస్‌పేటకు వెళ్లే క్రాస్ రోడ్డు యాక్సిడెంట్ జోన్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న ఇసుక తొలగింపు చర్యలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు ఆదివారం చేపట్టారు. జాతీయ రహదారి సిబ్బంది సహకారంతో దగ్గరుండి ఇసుకను తొలగింపు చర్యలు తీసుకున్న చేపట్టారు. ఇటీవల ఈ ప్రాంతంలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్న సందర్భంగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి, అధికారులతో కలిసి ఈ ప్రాంతాన్ని ఇటీవల పర్యవేక్షించారు. అక్కడ జరుగుతున్న ప్రమాదాలను తెలుసుకొని ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ప్రజాశక్తి-సంగం : సంగంలోని పలు ప్రాంతాల్లో ఇసుక వాహనాలతో రహదారులపై ఇసుక చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారుల ఇబ్బందులు తెలుసుకున్న ఎస్ఐ రాజేష్ పెన్నానది, జాతీయ రహదారి వద్ద రహదారిపై చేరిన ఇసుకను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దోజర్ సహాయంతో ఇసుక తొలగించి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



టిడిపి మండల కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-దగదర్తి : దగదర్తి మండల కార్యవర్గం ఎంపిక కావలి టిడిపి కార్యాలయంలో పార్టీ అధిష్టానం నియమించిన పరిశీలకుల సమక్షంలో ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. దగదర్తి మండలం టిడిపి అధ్యక్షునిగా అల్లం హనుమంతరావు అనే కొనసాగించాలని నిర్ణయించగా మండల ప్రధాన కార్యదర్శిగా ఇంజన్ కొండప నాయుడుని నియమించారు. మండల ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై మండల కేంద్రమైన దగదర్తిలో టిడిపి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంత కాలానికి మాలేపాటి కుటుంబం కబంధహస్తాల్లో నుంచి టిడిపికి విముక్తి లభించిందని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కష్టపడిన వారికి పదవులు దక్కే పరిస్థితి ఎంఎల్‌ఎ దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి హయాంలో జరుగుతుందని ఇది హర్షించదగ్గ విషయమని పార్టీ కార్యకర్తలు తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తుండడం గమనార్హం. టిడిపి మండల కమిటీ ఎంపికలో పనిచేసిన వారికే పదవులు అన్న టిడిపి నినాదం కొట్టొచ్చినట్లు కనబడుతుందని దగదర్తి మండల టిడిపి వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి యూనియన్ మాట్లాడుతూ మండల టిడిపి ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినందుకు ఎంఎల్‌ఎ దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని కార్యకర్తల అదృష్టం మేరకు నడుచుకుంటానని తెలిపారు.

సర్టిఫికెట్స్ అందజేత



ప్రజాశక్తి-కావలి : ఇటీవల సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు హిందీ ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర, ప్రవేశిక పరీక్షలో పాసైన విద్యార్థులకు ఆదివారం తుఫాన్ నగర్లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు ఎం.వి.ఎన్.ప్రసాదరావు, షేక్.ఖాదర్ బాషా, ఉపాధ్యాయురాలు జి.కళ్యాణి పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో చదువు కుంటున్న విద్యార్థులు హిందీ పరీక్షలు రాసేందుకు పరీక్ష ఫిజు కట్టిన జి.కళ్యాణికి, బుక్స్ వితరణ చేసిన దాత ఎంవిఎన్ ప్రసాద రావుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయురాలు జి.కళ్యాణిని సంస్థ ద్వారా ఘనంగా సత్కరించారు.

లోక్ అదాలత్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కావలి : లోక్ అదాలత్‌పై అవగాహన పెంచుకొని కక్షలు కార్పణ్యాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి తెలిపారు. కోర్టుకు రాని కేసులు, పెండింగ్ కేసులు, ఖర్చు కాలయాపన లేని అప్పీల్ లేని అంతిమ తీర్పులను లోక్ అదాలత్‌లో ఇవ్వటం జరుగు తుందని తెలిపారు. అలాగే కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కావలిలో జరుగు లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వరన్యాయం అందుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లో నిరుపేదలకు, ఎ.స్‌సి, ఎస్.టి.లకు ఉచిత న్యాయ సహాయం న్యాయ సలహాలు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కొండాపురం, జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు, మండలాల నుండి కక్షిదారులు సత్వర న్యాయం కోసం ఈ లోక్‌అదాలత్ సేవలను వినియోగించుకొని ప్రశాంతంగా జీవించాలన్నారు.



వికలాంగులకు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ అందించాలి

ప్రజాశక్తి-కావలి : ప్రభుత్వం వికలాంగులు, వృద్ధులకు ఇళ్ళవద్దే రేషన్ అందించాలని చెబుతున్నా, ఆచరణలో దిగువస్థాయి అధికారులు, రేషన్ డీలర్లు ఆలా అందించడం లేదని, వికలాంగులపై ముఖ్యంగా నిర్లక్ష్యం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు పేర్కొన్నారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గాలలో అధిక చోట్ల వికలాంగులకు రేషన్ అందించడం లేదని తెలిసిందన్నారు. అధికారులు, ఎం.ఎల్.ఎ.లు తమస్థాయిల్లో ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుని, పొరపాట్లు జరగకుండా సరిచేసుకోవాలన్నారు. ఒకవైపు ప్రభుత్వం వికలాంగులకు, వృద్ధులకు ఇళ్ళకే ఇవ్వాలని చెబుతున్న విధంగా, వారికీ రేషన్ అందించాలని వెంకట్రావు డిమాండ్ చేశారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కలిగిరి : అమ్మవారి చల్లన దీవెనలు అమ్మవారి పొంగలకు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అందాలని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నియోజకవర్గ టిడిపి నాయకులు అమ్మవారి పొంగలు చివరి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చీములవారిపాలెంలో కొలువుదీరిన అమ్మవారి పొంగల్లో కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కోర్కెలను నెరవేరుస్తూ పొంగళ్ల ప్రతిరోజు అనేక రూపాలలో వచ్చే భక్తులకు దర్శనమిస్తూ భక్తులు చేసే ప్రత్యేక ప్రార్థనలు తీర్థప్రసాదాలు అందుకున్న తల్లి అందరు ముక్కులను నెరవేర్చాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ రెడ్డి సంఘ అధ్యక్షులు కల్లూరు రాజారెడ్డి, మద్దిబోయిన కొండయ్య కట్టకింద పల్లె టిడిపి యూత్ లీడర్ చీమల సుధాకర్ బద్దల మహేష్ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో 'యూరియా'

వ్యవసాయ శాఖ జెడి సత్యవాణి



ప్రజాశక్తి-నెల్లూరు

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో జిల్లా రైతాంగం పంట సాగుబడి చేసేందుకు అవసరమైన అన్ని పనులు నిర్వహించుకోవడంలో బిజీబిజీగా ఉన్నారు. అయితే తమ పంట దిగుబడి రైతు ఆశించిన మేరకు చేసుకొనేందుకు అవసరమైన ఎరువుల కోసం రైతుసేవా కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ పంట దిగుబడి పెంచుకొనేందుకు వినియోగించే యూరియా కొరత లేకుండా సరఫరా చేసేందుకు ఎటువంటి చర్యలు ప్రభుత్వం చేపట్టిందో వ్యవసాయ శాఖ జేడి సత్యవాణి మాటల్లో...

ఇంటర్వ్యూ

ప్రశ్న. జిల్లాలో రైతాంగానికి అవసరమైన మేరకు యూరియాను ప్రభుత్వం సరఫరా చేస్తుందా.. చేస్తుంటే ఇప్పటి వరకు ఏంత మేరకు సరఫరా చేసింది..?

జవాబు. జిల్లాలో వ్యవసాయ సీజన్‌కు అవసరమైన మేరకు రైతాంగానికి సరఫరా చేసేందుకు యూరియా అందుబాటులో ఉంది. జిల్లాలో యూరియా కొరత లేదు. రైతులు ఎటువంటి పరిస్థితుల్లో యూరియాను వాడరాదన్నారు. ఇప్పటి వరకు జిల్లా రైతాంగానికి 7,35,000 బస్తాల యూరియాను సరఫరా చేశాం. ఈ నెలకు అవసరమైన మేరకు అంటే 1.5 లక్షల బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు.

ప్రశ్న. జిల్లాలో ఎన్ని హెక్టార్లలో రైతులు పంట సాగుబడి చేస్తున్నారు.. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు.. జిల్లాలో ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు.?

జవాబు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 32,418 హెక్టార్లలో పంటను రైతాంగం సాగుబడి చేస్తుంది. మార్క్‌ఫెడ్ ద్వారా పిఎసిఎస్‌లకు 7871 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల ద్వారా 2,287 మెట్రిక్ టన్నులు మొత్తం కలుపుకోని 10,159 మెట్రిక్ టన్నుల యూరియాను రైతాంగానికి సరఫరా చేశాం.

ప్రశ్న. ఏయే ప్రాంతానికి ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు..?

జవాబు. మార్క్‌ఫెడ్ ద్వారా వరి పంటను అధికంగా సాగుబడి చేస్తున్న కోవూరు నియోజకవర్గానికి 1,01,822 బస్తాల యూరియా, రూరల్ నియోజక వర్గానికి 33,222 యూరియా బస్తాలు, కావలి నియోజకవర్గానికి 30,022 బస్తాల యూరియా, సర్వేపల్లి ప్రాంతానికి 27 వేల యూరియా బస్తాలు, ఆత్మకూరు నియోజక వర్గ ప్రాంతానికి 22,500 యూరియా బస్తాలు, ఉదయగిరి నియోజక వర్గానికి 6,500 బస్తాల యూరియా, కందుకూరు నియోజకవర్గానికి 2,500 యూరియా బస్తాలు, వెంకటగిరి ప్రాంతానికి 2400 బస్తాల యూరియా సరఫరా చేశాం.

కార్మికుల మహాసభను జయప్రదం చేయండి..



మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

జిల్లా కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాలెం లోని అంబేద్కర్ భవనంలో జరుగుతున్న ఈ మహాసభల జయప్రదం చేయడానికి బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రంలో ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాధయ్య, పి.రాజయ్య ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆటో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుబోయిన రాజా, కోలంక సురేష్ పాల్గొని మాట్లాడుతూ జిల్లా ఆటో కార్మిక సంఘం ఈ జిల్లాలో 7వేలమంది కార్మిక వర్గానికి నాయకత్వం వహిస్తూ అతిపెద్ద గుర్తింపు పొందిన కార్మిక సంఘంగా కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ఉన్నాయని. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులపై అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎప్పటికప్పుడు కార్యక్రమాల రూపొందిస్తూ కార్మికుల సంక్షేమం కోసం, వాళ్ళ అభివృద్ధి కోసం పోరాటం కొనసాగిస్తూ ఉంది అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాక ముందు ఆటో కార్మికులకు రూ. 15వేలు వాహన మిత్ర పథకం ద్వారా ఇస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అయితే అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన కూడా ఇంతవరకు వాహన మిత్ర పథకం అమలు చేసిన పరిస్థితి లేదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం భారతదేశ కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టే విధంగా కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్లుగా చేసిందన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని జులై 9వ తేదీ దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఆటో 6వ జిల్లా మహాసభకు జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో ప్రతినిధులు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం సహాయ కార్యదర్శి సున్న సురేష్, మండల ఆటో నాయకులు వడ్డే మాల్యాద్రి, బి.దుర్గ, పి.రమేష్, బి.మల్లికార్జున్, ఎం.బాల కృష్ణ, ఎ.శ్రీనివాసులు, జి.నాగరాజు, వి.శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్లు, ఎస్‌కె.ఖాజా పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకట్రావుపల్లి పాఠశాలలలోని మౌలిక వసతులను రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఇన్ఫ్రా ముువ్వా రామలింగం, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరిలోని తరగతులను నూతనంగా నిర్మించిన భవనాలకు మార్చాలని మౌలిక వసతులు కల్పించే విషయంలో ముందుగా ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేయాలని అందుకు సంబంధించిన నిధులు వారం లోపు విడుదల చేస్తామని, మిగతా మౌలిక వసతులకు సంబంధించిన నిధులు త్వరితగతిన మంజూరు చేస్తామని ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె.షరీఫ్ బాషాకు ఎంఇఒలు షేక్ మస్తాన్ వలీ, తోట శ్రీనివాసులుకు తెలిపారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటరావుపల్లికి సంబంధించి మౌలిక వసతుల కల్పనలో త్వరితగతిన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి-వింజమూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ సారథ్యంలో సోమవారం వింజమూరులోని నేతాజీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పలు కంపెనీల వారి మేనేజర్లతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన యువకులు https://naipunyam.ap.gov.in/user registration వెబ్ సైట్లింక్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పదవ తరగతి పైబడి చదివిన 18 సంవత్సరాల నుండి 39 సంవత్సరాల నిరుద్యోగ యువతీ యువకులు ఈ చక్కని సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు.

పంచాయతీ పాలనకు ప్రాధ్యానత ఇవ్వాలి



మాట్లాడుతున్న బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి

ఆత్మకూరు-ఆత్మకూరు అర్బన్

కూటమి ప్రభుత్వం రాజ్యాంగ చట్టాలను తుంగలో తొక్కి ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, ముఖ్యంగా గాంధీజీ కలలు గన్న పంచాయతీ పాలనకు మంగళం పాడేలా వ్యవహరిస్తుందని వైసిపి పంచాయతీరాజ్ విభాగం ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి అన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి సూచనలతో పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం అందజేసే కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని వైసిపి కార్యాలయంలో పలువురు సర్పంచులు, నాయకులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధిహామి పథకం పనులు పంచాయతీ తీర్మానాలు లేకుండానే అవినీతిమయంగా జరుగుతున్నాయ న్నారు. ఈ ఉపాధి పనులపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలన్నారు. కూలీలకు నకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వారు అప్పుల పాలవుతున్నారని, ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు రాజ్యాంగ చట్టప్రకారం ఉన్న హక్కులను కాలరాసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1150 కోట్లను దారి మళ్లించారని, వెంటనే ఈ నిధులను గ్రామాల అభివృద్ధికి పంచాయతీల్లో జమ చేయాలని కోరారు. ఆర్టికల్ 73, 74 సవరణల మేరకు సర్పంచ్‌లకు ఉన్న అధికారాలను తిరిగి అమలు చేయాలని ఆయన కోరారు. జిఒ నెంబర్ 11 మేరకు ఇప్పటికే గాలిలో ఉన్న 1350 మంది పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగులు ఇచ్చి పెండింగ్లో ఉన్న ఏడాది కాలం నాటి జీతాలను విడుదల చేయాలని ఆయన కోరారు. గ్రామాల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నులను పంచాయతి స్థానిక నిధుల్లో జమ చేయాలన్నారు. సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, ఎంపిపిలకు గౌరవ వేతనాలు పెంచాలని, వాటిని వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. తల్లికి వందనం పథకాన్ని సర్పంచ్‌ల కుటుంబాలకు వర్తింపజేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఎందరో పేదలైన దళిత వర్గాలకు చెందిన సర్పంచ్‌లు తల్లికి వందనం పథకం అందుకోలేని పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం దారుణమన్నారు. ఏడాది కాలానికి టిడిపి ప్రభుత్వం రెండు హామీలను అమలు చేసిందని, ఇచ్చిన 143 హామీలు అమలు కావాలంటే ఎన్నేళ్ల సమయం పడుతుందోనని ఆయన ఎద్దేవా చేశారు. పంచాయతీ వ్యవహారాలపై జరుగుతున్న అవకతవకల గురించి సోమవారం పార్టీ నాయకులతో కలసి జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సూరం ప్రసాద్‌రెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాలేపాటి సతీష్, నాయకులు దాడి శ్రీనివాసులునాయుడు, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, సుమంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధా్న కార్యదర్శి అజయ్‌కుమార్

ప్రజాశక్తి-ముత్తుకూరు

జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ముత్తుకూరు శ్రామిక భవనంలో సిఐటియు ముత్తుకూరు మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మికులకు క్లాసును బోధించారు. ఈ క్లాసులకు అధ్యక్షులుగా డి.సుగుణమ్మ, కార్యదర్శి గోడ భాస్కర్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ క్లాసులో సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య, బిమోహన్ రావు, దుంపల ఏడుకొండలు, నక్క శ్యాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-మర్రిపాడు

అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా పెట్టి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో నాలుగు జతలుఎడ్లు పాల్గొన్నాయి. బండలాగుడు పోటీల మొదటి బహుమతి వినుకొండ రఫీ రూ.30వేలు, ద్వితీయ బహుమతి గుర్రం నారాయణ రెడ్డి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు, చిన్నబండ లాగుడు పోటీల్లో పుట్టుబోయిన వెంకటేశ్వర్లు రూ.15వేలు, ద్వితీయ బహుమతి గోగులపల్లి కృష్ణ తేజ రూ.10వేలు, తృతీయ బహుమతి మోదేపల్లి అచ్చయ్య రూ.5వేలు గెలుపొందగా ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఆలయ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ఎటువంటి వివాధాలకు తావు లేకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొండమూరి 20వ వర్థంతి




మాట్లాడుతున్న ఎస్‌కె సంధాని

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కొండమూరి పెద్ద మస్తానయ్య కమ్యూనిస్టు పార్టీకి విశేష సేవలు అందించారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో చెర్లో రమణారెడ్డి భవన్ (సిపిఎం కార్యాలయంలో కొండమూరి పెద్ద మస్తానయ్య 20వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా పెద్ద మస్తానయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ పెద్ద మస్తానయ్య, పార్టీలో చేరి విధేయుడుగా పనిచేస్తూ అనేక సమస్యలను పరిష్కరించారు. 20యేళ్లుగా ఆత్మకూరు కార్యదర్శిగా పని చేశారు. 1980-87 వరకు ఆత్మకూరులో జరిగి న ఘర్షణలో ధైర్యంగా నిలబడి పార్టీని ముందుకు నడిపించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఎస్‌కె.సంధాని, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, కార్యదర్శి కొండమూరి హాజరత్తయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, వాగాల శ్రీహరి, సాధిక్ హుస్సేన్, వెంకటరామిరెడ్డి, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మను దర్శించుకున్న పోలీస్ కమిషనర్



ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామ అంకాలమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆదివారం ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అందులో భాగంగా విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

2025వ సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మూలాపేట శివాలయం సెంటర్ శ్రీ వీరశైవ కళ్యాణ మండపంలో, జిల్లా అగ్నికులక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని 50మంది అగ్నికులక్షత్రియ, వన్నికుల క్షత్రియ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, నగదును అందజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చమ్మండి రాము మాట్లాడుతూ తమ సంఘం 17వ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. తమ విద్యార్థులు విద్యలో ఉన్నత శిఖరాలు చేరుకునేలా ఈ పురస్కార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడు సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు మెండుగా లభించేలా గ్రూపులను విద్యార్థులు ఎంచుకోవాలని తెలిపారు. ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులు పట్టు సాధించాలని, దాంతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లెంబాక వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌లను విద్యకు ఉపయోగపడే అవసరరీత్యా వినియోగించాలని కోరారు. దేశఖ్యాతిని చాటుతున్న వివిధ రంగాల గొప్ప వ్యక్తులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని, విద్యావంతులుగా తయారవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు సబ్ డివిజనల్ ఇంజనీరు పాకం రవితేజ, డాక్టర్ సాదా శ్రీలక్ష్మి, ఏలూరు వెంకటసుమంత్ కుమార్, పూజారి హరిత, తిరువత్తూరు శివశంకర్, సంఘం నాయకులు గండవరపు చంద్రశేఖర్, తదితరులున్నారు.